ప్రజాశక్తి

బుధవారం 21 ఆగస్టు 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

'సూపర్ సిక్స్' కోసం ఎదురు చూపులు

- ఎన్నికల మేనిఫెస్టో

అమలుపైనే అందరి దృష్టి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న సూపర్‌సిక్స్ పథకాలు అమలు కోసం జనం ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం పాలనలోకి వచ్చి మూడో నెలలు గడుస్తోంది. అందరూ కొంత కాలం వేచి చూద్దామనే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వం మారగానే తమ ఆలోచనలకు తగ్గట్టుగానే పనితీరు కూడా ఉండాలని కోరుకుంటారు. వేగంగానే మార్పులు ఆశిస్తారు. ఎందుకంటే ప్రజల ఆకాంక్షలు అలా ఉన్నాయి. అందుకే కూటమికి భారీ మెజార్టీ ఇచ్చారు. వైసిపి అభ్యర్థులను చిత్తుగా ఓడించారు. జనం మార్పుకోసం ఎంత వేగంగా ఆలోచించి ఓటేశారో అదే వేగం పాలనలో కనిపించడం లేదనే చర్చ సాగుతోంది. కొంత సమయం ఇవ్వాలనే చర్చ కూడా ఉన్నప్పటికీ జనంలో మాత్రం ఇంకా వేగంగా లేదనే చర్చ అంతర్లీనంగా ఉంది. ఎదురు చూపులే మిగిలాయి. పాలనలో వేగం లేదనే చర్చలూ సాగుతున్నాయి. కారణం కొన్ని అంశాలపై ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం. కొన్ని

విషయాల్లో అసాధారణ జాప్యం నడుస్తోంది. ఇప్పటి వరకూ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న హామీలు ఏ ఒక్కటీ ఆచరణలోకి రాలేదు. సూపర్ సిక్స్ ఎప్పుడనే ప్రశ్నలు ప్రతి పక్షాలనుంచే కాకుండా జనం నుంచి కూడా వినిపిస్తోంది. ఇప్పటి వరకూ పింఛను పెంపు, అన్నా క్యాంటీన్లు అమలు లోకి వచ్చాయి. ఇవి మేనిఫెస్టోతో సంబంధం లేని హామీలు. ఉచిత ఇసుకను ప్రారంభించినా ధర సగం తగ్గిందే తప్ప ఉచితంగా లేదు. దీనిపై పెద్దగా స్పందన రాలేదు. ఇక సూపర్ సిక్స్‌లో మహిళలు ఊరట చెందేవే ఎక్కువగా ఉన్నాయి. ప్రతి మహిళకు

▶ 2లో

'సూపర్‌సిక్స్‌' కోసం ఎదురు చూపులు

(మొదటిపేజీ తరువాయి)

నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం వంటివి ఉన్నాయి. వీటికోసం ఎదురు చూస్తున్నారు. వీటితో పాటు నిరుద్యోగభృతి, రైతులకు ఏటా రూ.20వేలు, ప్రతి విద్యార్థికి రూ.15వేలు వంటివి మేనిఫెస్టోలో ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడా ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి రైతులకు ఇపుడు డబ్బులు అవసరం. ఖరీఫ్ కొనసాగుతోంది. రబీ కూడా వస్తోంది. ఇపుడు రైతులకు పెట్టుబడికి కీలక దశ. ఈ దశలో డబ్బులు ఇస్తే ఊరట కలుగుతుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉంది.దీంతో ఏ పథకం ఇప్పటికిప్పుడు అమలు చేసేలా కనిపించడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపైనా ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఈఏడాది చివరి నాటికి అన్నీ అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.ఇక జిల్లాలో చూస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఆశగా ఎదురు చూస్తున్నారు. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు ఒంగోలులో విలీనం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. వీటిపై మంచి స్పందన వచ్చింది.ఎందుకంటే గత ప్రభుత్వం జిల్లాల విభజనపై అన్ని పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయి. ప్రజల్లోనూ ఇదే ఉంది. పశ్చిమాన దీని ప్రభావం బాగా ఉంది. అయితే ఆరు నెలల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంత వరకూ ఎందుకనే చర్చ సాగుతోంది. మంత్రివర్గ సమావేశాల్లోనూ జిల్లాకు సంబంధించిన ఈ కీలకమైన హామీలు చర్చకు రావడంలేదు. బదిలీలపైనా నాన్చుడు ధోరణి కూడా పాలనలో వేగం తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది. కలెక్టర్, ఎస్‌పిలు తప్ప జిల్లా అధికారులకు సంబంధించి బదిలీల ప్రక్రియ జరగలేదు. అందరూ ఎదురు చూస్తున్నారు. ఉన్నవాళ్లు పనిచేయడం లేదు.కొత్తవాళ్లు వచ్చాక చేస్తారనే భావనలో వారు ఉన్నారు. కీలక నిర్ణయాలూ వాయిదా పడుతున్నాయి. పాలనపై ప్రభావం చూపుతున్నాయి. ఇలా అన్ని విషయాలు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. అటు పాలనలో వేగం కనిపించక.. ఇటు మేనిఫెస్టోలో హామీలు అమలులోకి రానందున ప్రజల్లో ప్రభుత్వంపై కొంత సందిగ్ధంగానే ఉంది.

దోమల నివారణకు డ్రోన్ల సాయంతో ఆయిల్ పిచికారీ

యాంటీ లార్వా ఆపరేషన్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్‌కు నగరపాలక సంస్థ అధికారులు శ్రీకారం చుట్టారు. పోతురాజుకాలువ, దాని పరిసర ప్రాంత కాలనీలు, నగరంలో ఉన్న పెద్ద పెద్ద మురుగు కుంటలలో ఈ యాంటి లార్వా ఆపరేషన్ జరుగుతోంది. మంగళవారం నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. డ్రోన్ల సాయంతో దోమల నివారణకు వినియోగించే పైరోషిన్ ఆయిల్‌ను పిచికారీ చేస్తున్నారు. పోతురాజు కాలువ అంతటిని డ్రోన్లు జల్లెడ పడుతున్నాయి. మొదటగా పోతురాజుకాలువ ప్రారంభ ప్రాంతమైన గణపతి నగర్ నుంచి ఈ ఆపరేషన్ మొదలైంది. పోతురాజుకాలువతో పాటు సమతానగర్, రెవెన్యూ కాలనీ, కొత్తడొంక, పేర్నమిట్ట, త్రోవగుంట, బలరాం కాలనీ, కేశవరాజు కుంట ప్రాంతాలలో డ్రోన్ల ద్వారా రోషిన్ ఆయిల్‌ను పిచికారీ చేశారు. మరో మూడు రోజులు నగరంలో ఈ ఆపరేషన్ నిర్వహించనున్నట్లు శానిటరీ సూపర్ వైజర్ ఎన్. పిచ్చయ్య తెలిపారు. నగరంలో వర్షం నీరు, మురుగు నీరు నిల్వ ఉండి, దోమల ఆవాస ప్రాంతాలుగా ఉన్న అన్నీ పెద్ద మురుగు కుంటలలో డ్రోన్ల సాయంతో దోమలను నివారించేందుకు ఆయిల్‌ను పిచికారీ చేస్తామని ఆయన తెలిపారు.

పల్లెల్లో జోరుగా బెల్టు షాపులు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపుల నిషేధం విధించడానికి కసరత్తు చేస్తుంటే పల్లెల్లో బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నా తమకేమీ పట్టనట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారు. పల్లెల్లో తాగటానికి మంచినీరు దొరకడం కష్టంగా ఉన్నా, మద్యం మాత్రం ఏరులై ప్రవహిస్తోంది. 30 మందికి ఒక షాపు లెక్కన.. లేకుంటే ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చే విధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉదయం మొదలుకొని రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా అమ్మకాలు సాగుతుండడంతో మందుబాబుల హడావిడి కూడా అదే స్థాయిలో కనిపిస్తోంది. రోడ్లపై గోల చేస్తూ ఎక్కడంటే అక్కడే పడిపోతున్నారు. ఒక మనిషికి మూడు బాటిళ్ల చొప్పున ఇవ్వాలనే నిబంధన ఉండగా బెల్ట్ షాపుల నిర్వాహకుల వద్ద మాత్రం కేసులకొద్దీ మందు బాటిళ్లు ఉంటున్నాయి. షాపు నిర్వాహకులు బెల్టు షాపుల వారి నుంచి ఒక్కో బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకొని ఎక్కువ బాటిళ్లు ఇస్తున్నట్లు సమాచారం. పల్లెల్లో మాత్రం ఎమ్మార్పీ కంటే 60 లేక 70 రూపాయలు అదనంగా తీసుకుని అమ్ముకుంటున్నారు. తెల్లవారేసరికి మందుబాబులు మద్యం తీసుకుని హడావుడి చేస్తుంటే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఇన్ని జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

షీప్ సొసైటీ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్ పురం

ప్రకాశం జిల్లా షీప్ సొసైటీ ఛైర్మన్‌గా నియమింపబడ్డ తోడేటి గోపిని పలువురు మండల నాయకులు మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. సిఎస్ పురం వైస్ సర్పంచ్ పాములపాటి నరసయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దాసరి మల్లికార్జున, మన్నెపల్లి చిన్ని, దరిశి ఆదినారాయణ, ఐటిడిపి మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పదవి సిఎస్ పురం మండలానికి చెందిన గోపికి రావడంలో ఎంఎల్‌ఎ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషి అభినందనీయమని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గోపిని సన్మానిస్తున్న నాయకులు

చిరుధాన్యాల సాగుతో ఆదాయం

ప్రజాశక్తి-కొమరోలు: చిరుధాన్యాల సాగుతో ఆదాయం పెంచుకోవచ్చని వ్యవసాయాధికారి కె.రాజశ్రీ తెలిపారు. మండలంలోని బావాపురంలో ఆహారం, పోషకాహార భద్రత పథకంలో భాగంగా కొర్రపంటలో క్లస్టర్ డెమో కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు, అపరాలు వంటివి పంటల ద్వారా రైతుల ఆదాయం పెంచవచ్చన్నారు.

PASSPORT LOST

I, MIRIYALA NEERAJA
W/o.KRISHNA MURTHY
aged about 47 Years, R/o.26-1-77A, Pappu Bazar, Near Potti Sriramulu Vigraham, Ongole,Prakasam District, Andhra Pradesh. I have lost my passport while i was travelling from my house to court centre ongole for xerox by motor cycle **PASSPORT NO.A9682069** which was issued on **14-05-2001** at Hyderabad.
The said Above Passport was lost on 01-08-2024 Near Court Centre.
IF FOUND PLEASE CALL : 98491 38999

పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక అభివద్ధి విధానం, ఎంఎస్‌ఎంఇ వ్యవస్థాపకత , ఆహారశుద్ధి పరిశ్రమల విధానం 2024-29 రూపకల్పనకు వివిధ పరిశ్రమ వర్గాల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సుబ్బారావు సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో లభించే మినరల్స్, ఆక్వా కల్చర్ , వరిపంట , గ్రానైట్ ఖనిజాలు, రొయ్యల పెంపకం, గ్రానైట్ పరిశ్రమలు, రొయ్యలు, చేపలు శుద్ధి పరిశ్రమలు, రైస్ మిల్స్, ఆటోమొబైల్ స్పేర్ పార్టులు, టూరిజం, సేవా రంగం, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమని తెలిపారు. రాయల్ మెరైన్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి విజయ కుమార్ మాట్లాడుతూ మెరైన్ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం నిర్దేశించిన 40 అడుగుల రోడ్డు నిబంధన కొంత సడలించాలని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం వారు ఇచ్చే విద్యుత్ బిల్లు తిరిగి చెల్లింపు విధానం బదులుగా విద్యుత్ బిల్లు చెల్లించేటప్పుడే మినహాయింపు ఇవ్వాలన్నారు. ఫ్యాపషియా ప్రతినిధి కె. సుబ్బారావు మాట్లాడుతూ ఇఒడిబి లో నిర్దేశించిన రిఫార్మ్స్ ను సరళతరం చేస్తూ, కొన్ని రకాల అనుమతులను అవసరం లేకుండా ఎత్తివేయాలని కోరారు. పరిశ్రమలకు రుణం మంజూరు చేసేందుకు బ్యాంకుల నిబంధనలు సరళతరం చేయాలన్నారు. పరిశ్రమలకు టాక్స్ రిఫార్మ్స్‌లో భాగంగా జిఎస్‌టి ఫైలింగ్ కోసం ప్రభుత్వం తరపు నుండి దిశానిర్దేశం చేయాలన్నారు. చీరాల ఆటోనగర్ అసోసియేషన్ నుంచి ఎం. శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఎపిఐఐసి ద్వారా స్థలం కొనుగోలు చేసిన బీసీ మహిళలకు కూడా ఎస్,ఎస్‌టిలకు ఇచ్చే మాదిరిగానే రాయితీ ఇవ్వాలన్నారు. ఇండస్ట్రియల్‌ఎస్టేట్స్‌లో మౌలిక సదుపాయములు మెరుగు పరచాలన్నారు. హేచరీ పరిశ్రమలకు డెడికేటెడ్ ఫీడర్ ఏర్పాటు చేసి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని హేచరీ అసోసియేషన్ నాయకులు కోరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున టి. శిరీష మాట్లాడుతూ రైస్ మిల్లులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలన్నారు. ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కోసం ఇపిసిజి వారు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వారి బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున ఇంటూరి ఆంజనేయులు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలకు ట్రూ అప్ ఛార్జీలు ఎత్తివేయాలన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసినప్పుడు ఒసి లకు కూడా ఎస్‌సి,ఎస్‌టిల మాదిరిగానే రాయితీలు కల్పించాలన్నారు. ఈ సమావేశం జిల్లా పరిశ్రమల అధికారి వై. రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ నెం: 1101/2021

ఇన్

ఓ.యస్ నెం: 132/2019

బత్తిని రమాదేవి ..పిటిషనర్ /వాది

వర్సస్

రేగలగడ్డ ఆవులయ్య చనిపోతే
ఆయన వారసులు 2 టు 4 రెస్పాండెంట్లు
.. రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు,

R2 రెస్పాండెంట్ /ప్రతివాది చిరునామా
రేగలగడ్డ వెంకటేశ్వర్లు తండ్రి ఆవులయ్య, ప్రస్తుత సర్పంచ్, హిందూ, వయస్సు 46 సంవత్సరాలు, సోమిదేవిపల్లి గ్రామం, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా.

R3 రెస్పాండెంట్ /ప్రతివాది చిరునామా
రేగలగడ్డ తిరుపతి తండ్రి ఆవులయ్య, ఆర్మీ ఉద్యోగం, హిందూ, వయస్సు 34 సంవత్సరాలు, సోమిదేవిపల్లి గ్రామం, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా.

R4 రెస్పాండెంట్ /ప్రతివాది చిరునామా
కటారు రవణమ్మ తండ్రి ఆవులయ్య, గృహిణి, హిందూ, వయస్సు 44 సంవత్సరాలు, సోమిదేవిపల్లి గ్రామం, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని ప్రతివాదులపై, దావా పరిహారం రాగోరి మీపై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 04-10-2024 వ తేదీన యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
వాయిదా తేదీ : 04-10-2024 ఇట్లు
శ్రీ డి.సిద్దయ్య,
వాది తరుపు అద్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం : **8897214930**

పాస్ పోర్టు పోయినది

ప్రకాశం జిల్లా, పొదిలి మండలం, పొదిలి పట్టణంలోని నవాబ్ మిట్టకు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్, తండ్రి మౌలాలి అను నేను ఈ నెల రెండవ తేదీన ఆటోలో విశ్వనాథపురం నుండి ఇంటికి వచ్చుచుండగ నా పాస్ పోర్ట్ పోయినది. పాస్ పోర్ట్ నెంబర్: U1759919, 08-11-2019, గల ఈ పుస్తకము ఎవరికైనా దొరికిన యెడల క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
షేక్ అబ్దుల్ రెహమాన్,
తండ్రి మౌలాలి,
నవాబ్ మిట్ట, పొదిలి.
సెల్ :**9441719730.**

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

O.S. NO: 156/22

బిట్వీన్
నక్క సాంబశివరావు ..... వాది
మరియు
జూటూరి యేగమ్మ, వగైరా .... ప్రతివాదులు

To
నక్క నాగలక్ష్మి .. **ప్రతివాది 3**
భర్త వెంకటేశ్వర్లు, గొల్లవిడిపి గ్రామం,
ఎర్రగొండపాలెం (మం) ప్రకాశం (జిల్లా)

పై నెంబరు దావాలో వాది ప్రోనోటు వగైరా పరిహారములను మీపై దాఖలు చేసి యున్నందున మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారాను రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీసులు పంపిన ను అవి జారీ కాబడి ఉండలేదు. కావున శ్రీయుత కోర్టు వారి అనుమతితో మీకు సమను పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియ జేయడమైనది. ఇందును గురించి మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ : 04-09-2024 ఉ. గం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై లిఖితపూర్వకంగా తెలుపుకొనునది. లేనియెడల పై విషయమును మీ పరోక్షముగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

// శ్రీయుత కోర్టు వారి అనుమతితో //

అద్దంకి **బత్తుల రామకోటయ్య**
తేది: 20-08-2024 వాది తరుపు అద్వకేట్, అద్దంకి
సెల్ **9985049244**

పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అన్నదానం ఆదర్శనీయం

ప్రజాకవి డాక్టర్ మొగిలి దేవ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందించిన స్ఫూర్తి సమాజానికి ఆదర్శనీయమైనదని ప్రజాకవి డాక్టర్ మొగిలి దేవ తెలిపారు. జనసేన ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ జడా బాల నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక కొండయ్య బంకు వద్ద మంగళవారం జరిగిన డొక్కా సీతమ్మ నిత్య అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రజాకవి డాక్టర్ మొగిలి దేవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరిట జనసేన నాయకులు జడా బాల నాగేంద్ర గత 34 రోజులుగా నిర్విఘ్నంగా పేదలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆనాడు డొక్కా సీతమ్మ 24 గంటలు బాటసారులకు, పేదలకు లేదనకుండా అన్నం పెట్టి ఆకలి తీర్చిన మహోన్నతురాలని కొనియాడారు. గ్రామ స్వరాజ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నిత్య అన్నదానం నిర్వహించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దాతలు ఈ మంచి కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు చెంగలశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం మిన్న అన్నారు. ఇంతటి మహత్కార్యం చేపట్టిన జడా బాల నాగేంద్ర అభినందనీయులన్నారు. అన్నదాన నిర్వాహకులు జడా బాల నాగేంద్ర మాట్లాడుతూ తమ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పేదలకు ప్రతి నిత్యం 300 మందికి పైగా అన్నదానం చేస్తున్నామని, పేదల ఆకలి తీర్చి వారి కళ్ళల్లో కలిగే ఆనందపు వెలుగులు చూసినప్పుడు తనకు ఎనలేని సంతృప్తినిచ్చిందన్నారు. దాతలు సహకరిస్తే మరింత విస్తృతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట సుధాకర్ బాబు, పువ్వాడ శ్యామ్, కోటయ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న డాక్టర్ మొగిలి దేవ, జడా బాలనాగేంద్ర యాదవ్

ఇ-క్రాప్‌లో పంట నమోదు చేస్తున్న అధికారులు

కంది పంట పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని పెట్లూరు గ్రామంలో రైతులు సాగుచేసిన కంది పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు 1450 ఎకరాల్లో కంది పంట సాగుచేసినట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధర, ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల రాయితీ పథకాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ పద్మ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అసంబద్ధ పని సర్దుబాటును నిలిపివేయాలి

యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా జరిపిన అసంబద్ధ పని సర్దుబాటును నిలిపివేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, డి.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల సబ్జెక్ట్ టీచర్ల కొరత పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అస్తవ్యస్థంగా ముగిందన్నారు. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా, పాఠశాలల అవసరాలను గుర్తించకుండా డిజిటలైజేషన్ పేరుతో మొత్తం విధానాన్ని కేంద్రీకరించటం ఉపాధ్యాయులలో తీవ్రమైన గందరగోళానికి తావు ఇచ్చిందన్నారు. వందలాదిగా వచ్చిన ఉపాధ్యాయుల అభ్యంతరాలను ఖాతరు చేయకుండా మొండిగా పని సర్దుబాటును హడావిడిగా ముగించారన్నారు. మేనేజ్‌మెంట్ల వారీగా పని సర్దుబాటు జరగాలని, ప్రమోషన్‌కు అన్‌విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు పంపారన్నారు. సీనియారిటీ, మెరిట్ కం రోస్టర్ విధానాన్ని పాటించాలని, 1, 2 తరగతులలో బోధించే టిటిసి, డిఎడ్ ఉపాధ్యాయులను సర్దుబాటు ప్రక్రియలో చూపించటం, ఉర్దూ పోస్టులను కూడా నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారన్నారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికి తగినన్ని పోస్టులు ఇవ్వకపోగా మిగులు పోస్టులుగా చూపించారని తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలో పనిచేసిన ఇతర మేనేజ్‌మెంట్ల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీ విషయంలో సీనియర్లకు అన్యాయం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనలు తొలగించి, విద్యా సంవత్సరం సాఫీగా జరిగేలా చూడాలని వారు కోరారు.

జగన్ హయాంలో ప్రాజెక్టులు విధ్వంసం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో సాగునీటి ప్రాజెక్టులు అత్యంత నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైంది జగన్ హయాంలోనే అని, ఈ విషయం దాస్తే దాగదు అని గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ట్విట్టర్‌లో జగన్ చేసిన ట్వీట్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఘాటుగా స్పందించారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫేక్ రాజకీయంతో లబ్ధి పొందాలనుకునే జగన్ దుర్మార్గపు ఆలోచనలను ప్రజలు విశ్వసించరన్నారు. గత ఐదేళ్లలో మిగిలిన 10 నుండి 20 శాతం పనులు పూర్తి చేసి వెలిగొండ ద్వారా నీళ్లివ్వలేకపోయిన నువ్వు నేడు బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో కూర్చుని ట్వీట్లు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. సలహాదారులకు, సాక్షి పత్రికకు, సర్వే రాళ్లపై బొమ్మలకు చేసిన ఖర్చు ఎంతో.. సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసింది ఎంతో దమ్ముంటే ప్రకటించాలని సవాల్ విసిరారు. సాగునీటి రంగానికి, రాష్ట్ర రైతాంగానికి జగన్ ఐదేళ్ల పాపపు పాలన ఒక శాపంగా మారిందన్నారు. తప్పుడు ప్రచారంతో ఎల్లకాలం రాజకీయం సాగదు అని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

మూఢనమ్మకాలపై అవగాహన అవసరం

జెవివి నాయకులు డాక్టర్ హరిబాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యార్థి దశనుంచే మూఢనమ్మకాలపై అవగాహన కలిగి వుండాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.హరిబాబు అన్నారు. శింగరాయకొండ గవర్నమెంట్ హైస్కూల్‌లో శాస్త్రీయ దక్పథ దినోత్సవం (సైన్స్ టెంపర్ డే), డాక్టర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.హరిబాబు మాట్లాడుతూ మూఢ నమ్మకాలను విద్యార్థి స్థాయినుంచే వదలివేయాలన్నారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి కోటపాటి నారాయణ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రచురణలో, చెకుముకి పుస్తకాలు అందరూ చదవాలని, చెకుముకి సంబరాలు (టాలెంట్ టెస్ట్) రాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాధికారి మహంకాళి నరసింహారావు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కేశవరాజు, టి.ఆనందకుమారి, పి.విజయలక్ష్మి, ప్రతాపరెడ్డి, వివి.రమణారెడ్డి, కె.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి నాయకులు డాక్టర్ హరిబాబు

ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణా కార్యక్రమం మండలంలోని వెన్నూరు, కె.ఉప్పలపాడు రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వి.వి.శేషమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వాడడం వలన నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతుకు నికర ఆదాయం తగ్గిపోయిందన్నారు. కావున ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగియుండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యం.టి. ఎస్తేరు రాణి జీవామృతాలు, కషాయాల తయారీ గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి డి.విజయ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల వ్యవసాయ సహాయకులు జె.కొండలరావు, డి.జయలక్ష్మమ్మ, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

గంజాయి తరలిస్తున్న వాహనం పట్టివేత

50 కిలోల గంజాయి స్వాధీనం, ఒకరి అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

గంజాయి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసిన సంఘటన టంగుటూరు టోల్‌గేట్ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కెఎ45ఎ3514 నంబరు గల కొరియర్ వాహనంలో బీఫ్ మధ్యలో గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వాహనం విశాఖపట్నం నుండి చెన్నై వెళ్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు శింగరాయకొండ సిఐ చావా హాజరత్తయ్య తన సిబ్బందితో టోల్‌గేట్ వద్ద నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించారు. 50 కిలోల గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని రవికుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హాజరత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తుళ్ళూరు శ్రీరామ్, యు.పున్నారావు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-కనిగిరి

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కనిగిరి జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు. సీతారామాపురం గ్రామానికి చెందిన నాలి వెంకటయ్య కనిగిరికి చెందిన దాసరి రాఘవయ్య వద్ద మూడు లక్షలు అప్పు తీసుకొని దాని తాలూకు నాలుగు లక్షలకు చెక్కు ఇచ్చారు. సదరు రాఘవయ్య చెక్కును బ్యాంక్‌లో వేయగా అది బౌన్స్ అయ్యింది. ఈ కేసు ఆరు సంవత్సరాల క్రితం నమోదవగా విచారణ కొనసాగుతోంది. మంగళవారం నిందితుడు నాలి వెంకటయ్యకు ఒక సంవత్సరం జైలు శిక్ష, నాలుగు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు.

పెద్దారవీడు ఎస్ఐగా అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండల ఎస్ఐగా పి.అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎస్ఐ అనిల్‌కుమార్

ఎస్ఐ గిరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

పొన్నలూరు ఎస్ఐగా గిరిబాబు

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు నూతన ఎస్ఐగా గిరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైని కలిశారు. ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జూదం, బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటానని ఎస్ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ సుబ్బారావు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా, చిత్తశుద్ధితో అధికారులు పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపాలని సంయుక్త కలెక్టర్ సుబ్బారావు కోరారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ, డిఆర్డిఎ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పంచాయతీల్లో గ్రామ సభలు సమర్ధవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా నిర్వహించక పోవడం వల్లనే వెనుకబడి పోతున్నామన్నారు. ప్రణాళికలు రూపొందించుకుంటే సుస్థిరాభివృద్ధి సాధించగలమని సూచించారు. ఈనెల 23నుంచి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో జరిగే గ్రామ సభలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్షించి చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజులు పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. చెత్త నిల్వ కేంద్రాలను అక్టోబర్ 2నాటికి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో పంచాయతీలకు అదనపు ఆదాయం రావడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఫ్రీ వన్ యాప్ ద్వారా జిల్లాలోని జనావాసాల మధ్య ఉన్న మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకులు శుభ్రపరిచి, చెత్త కుప్పలు పూర్తిస్థాయిలో తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఓడిఎఫ్ సర్వే రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏ పనులు చేపట్టి అభివృద్ధి చేసుకోవాలో తీర్మానించు కోవడానికి గ్రామసభ ప్రధాన వేదిక చేయాలని అన్నారు. వివిధ గ్రామాలకు ఏ పనులు అవసరమో క్షేత్రస్థాయిలో మాట్లాడుకుని తీర్మానించు కోవాలన్నారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలు అర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పనులు కూలీలు రైతులకు ఉపయోగపడేలా, ఉత్పాదకత పెంపొందించేలా ఉండాలని అన్నారు. నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ప్రకారం పనులు నిబద్ధతతో పూర్తిగా జరిగేలా చూడాల్సిన కర్తవ్యం అధికారులదే అన్నారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో డిపిఓ, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశంలో జెసి సుబ్బారావు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహశీల్దారుగా పనిచేస్తున్న మేక శ్రీనివాసరావు కుమారుని వివాహ వేడుకలు గుంటూరులో మంగళవారం జరిగాయి. ఈ వేడుకలకు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వాక శేషుబాబు, రాయల ప్రసాదరావు, అనగాని ఏడుకొండలు, ఎర్రగళ్ల సాంబయ్య, నూతక్కి దినకర బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న మేజెర్ అంజిరెడ్డి సుబేధర్

వాడరేవులో ఎన్‌సిసి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు నూతనంగా ఎన్‌సిసి యూనిట్‌ను మేనేజర్ వి అంజి రెడ్డి, సుబేదార్ మేజర్ రేఖాసింగ్ మంగళవారం ప్రారంభించారు. ఎన్‌సిసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌సిసి యూనిట్‌ను ప్రారంభించడం వలన పాఠశాల్లో క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు తయారవుతారని అన్నారు. ఎన్‌సిసిలో చేరడం వల్ల అనేక కోర్సుల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, పాఠశాల హెచ్‌ఎం కౌతవరపు శ్రీనివాసరావు, ఎన్‌సిసి కేర్ టేకర్ రామ్ నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఐకి ఘన సన్మానం

ప్రజాశక్తి - వేటపాలెం

తెలుగు యువత మండల అధ్యక్షుడు వెంగళ భరత్ ఆధ్వర్యంలో ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎస్ఐగా మీసాల వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేయాలని కోరారు. పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడడంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రజల, నాయకుల సహకారంతో ఎలాంటి అసాంఘిక ఘటనలు జరగకుండా చూస్తానని చెప్పారు. ప్రజలు, నాయకులు తనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పేరిసెట్ల శ్రీహరి, మాచర్ల సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల సర్వ సభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపిఓ కృష్ణ కుమారి తెలిపారు. సమావేశానికి ఎంపిపి రజని అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని ఎంపిపి డివి లలితకుమారి అన్నారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని వెల్లటూరు పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి జరపీడుతులను గుర్తించాలని చెప్పారు. బాధితులకు తగిన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. అనంతరం కలకత్తాలో వైద్యురాలపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలిపై జరిగిన అమానుష చర్యను ఆమె తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సిహెచ్ రామలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, వైద్య సిబ్బంది

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నట్లు ఇరువురు వ్యక్తులకు 2018లో తీర్మానం చేసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రెండు ట్రాక్టర్లను అప్పగించిన విషయంపై అందుకు బాధ్యులైన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టాలని పంచాయితీ పాలకవర్గం తీర్మానించింది. 2018లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు అప్పటి ప్రభుత్వం రెండు ట్రాక్టర్లను మంజూరు చేసింది. వీరు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నట్లు అప్పట్లో అధికారులు ఎజెండాలో నమోదు చేసి తీర్మానించారు. ఈ ఇద్దరు గతంలో ఎప్పుడూ పారిశుద్ధ్య కార్మికులగా పనిచేయలేదని పాలకవర్గ సభ్యులు చర్చించారు. వీరికి మంజూరు చేసిన ట్రాక్టర్ల బకాయిని పంచాయతీ చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ నుండి నోటీసులు రావడం పట్ల పాలకవర్గం విస్మయ వ్యక్తం చేసింది. అప్పట్లో స్వచ్ఛ భారత్ పథకం కింద అందించిన రెండు ట్రక్టర్లు ఎక్కడ ఉన్నాయి? అందుకు పంచాయతీ తొలి కిస్తీ చెల్లించిన అంశాలను పరిశీలన చేయాలని సభ్యులు కోరినట్లు సమాచారం. అసలు చెల్లించారా? లేదా? చెల్లించి ఉంటే ఎంత చెల్లించారు? ఎప్పుడు చెల్లించారు? అనే అంశాలను పరిశీలన చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. దీనిలో అప్పట్లో కొందరి ప్రమేయంతో అవినీతి జరిగినట్లుగా స్పష్టం అవుతుందని, పూర్తిస్థాయిలో విచారించి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వివరించారు. పంచాయతీ కార్యాలయంపై నిర్మించిన సమావేశ మందిరంలో అప్పట్లో అవినీతి జరిగిందని, దానిని కూడా త్వరలో విచారించి వెలుగులోకి తీసుకురావాలని బోర్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచి ధారా రవికిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, ప్రసాద్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి - చీరాల

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని ఎఎల్ఓ రామకృష్ణ కోరారు. చైల్డ్ లేబర్ డ్రైవ్ సందర్భంగా పట్టణ, పరిసర ప్రాంతంలో బాల కార్మికుల సమాచారం కోసం మంగళవారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ దుకాణాలు, మెకానిక్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో ఒక బాలుడిని గుర్తించి తీసుకువెళ్లి పాఠశాల్లో చేర్చినట్లు ఆయన తెలిపారు. 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని దుకాణ యాజమానులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చైల్డ్ లేబర్ డిపార్ట్మెంట్ తీసుకోబోవు చర్యలకు యజమానులు గురవుతారని హెచ్చరించారు. షాడోస్ సంస్థ ప్రతినిధి రాజా సాల్మన్ మాట్లాడుతూ చిన్నపిల్లలు బడికి వెళ్లాలలని అన్నారు. చిన్నపిల్లల్ని పనికి పంపడం, అక్రమ రవాణా చేయడం నేరమని సూచించారు. కార్యక్రమంలో షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్మెంట్ రాము, కిషోర్ పాల్గొన్నారు.

బాలుడిని పాఠశాల్లో చేర్పిస్తున్న షాడో సంస్థ ప్రతినిధులు

ఆర్‌టిసి డిపో అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రేపల్లె

డిపో అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్టీసీ డిపో ఇన్చార్జి మేనేజర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నూతన బస్సుల్లో డిపోకు రెండు ఇంద్ర బస్సులు కేటాయించినట్లు తెలిపారు. నూతనంగా వచ్చిన బస్సులను మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం ప్రారంభిస్తారని తెలిపారు. డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్థికంగా డిపో వెనుకబడి ఉందని అన్నారు. మైలేజీ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిపో అభివృద్ధికి అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో డిపోను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. డిపోలోని అన్ని సమస్యలు పరిష్కరించి ప్రగతి పథంలో నడిచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డిపో మేనేజర్ రాజశేఖర్

గ్రంథపాలకుడు సుగుణరావును సన్మానిస్తున్న దృశ్యం

గ్రంథపాలకుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉత్తమ గ్రంథపాలకునిగా అవార్డు అందుకున్న సందర్భంగా గ్రంథపాలకుడు సిహెచ్ సుగుణరావును జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య తమ ఆర్థిక సహాయంతో ప్రకాశం ప్రభుత్వ బాలుర హైస్కూల్ 10మంది విద్యార్థులకు డిపాజిట్లు అందజేశారు. అవార్డు వచ్చిన సందర్భాన్ని ప్రత్యేకంగా గుర్తుంచుకొని తనను సన్మానిచటమే కాకుండా గ్రంథాలయ అభివృద్ధికి 10 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాలు ఇచ్చిన విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య, కార్యదర్శి కాసు ఆదిలక్ష్మికి అభినందనలు తెలిపారు.

కడుపు నింపుతున్న కట్టెలు..!

- నిలిచిన ఉపాధి పనులు
- వ్యవసాయ పనులు అంతంతమాత్రమే
- కూలీలకు ఆసరాగా చిల్లకర్ర

కర్రను లారీలో లోడ్ చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉపాధి పనుల ఊసేలేదు. వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కట్టెలే కూలీలకు ఆధారంగా నిలుస్తున్నాయి.వాగుల్లో, వంకల్లో, పొలాల గట్లకు ఉన్న చిల్లకర్రను కొట్టి విక్రయిస్తున్నారు. క్వింటా కర్ర ధర రూ. 270 పలుకుతోంది. భార్యాభర్తలిద్దరూ కలిసి రోజుకు ఐదు క్వింటాళ్ల కర్ర కొడుతున్నారు. ఆ కర్రను చెదిగి, ముక్కలు చేసి రిక్షాపై తెచ్చుకొని యర్రగొండపాలెంలోని మార్కాపురం రోడ్‌లోనున్న వేబ్రిడ్జి పక్కన విక్రయిస్తున్నారు. భార్యాభర్త కలిసి రోజుకు రూ. 1,350 సంపాదిస్తున్నారు. లాభదాయకంగా ఉండడంతో వందలాది మంది కూలీలు కర్ర బాట పడుతున్నారు. యర్రగొండపాలెం నుంచి ప్రతి రోజూ ఐదు లారీల కర్ర గుంటూరు జిల్లా పేరేచర్ల ధర్మల్ పవర్ ప్లాంట్‌కు తరలుతోంది.

యర్రగొండపాలెం కేంద్రంగా..

చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి తెచ్చిన కర్ర యర్రగొండపాలెం కేంద్రంగా కొందరు వ్యాపారస్తులు టన్ను రూ. 2700 కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత 20 టన్నులు సామర్థ్యం కలిగిన లారీలో కర్ర బేర్పినందుకు రూ. 5 వేలు చెల్లిస్తున్నారు. లారీ బాడుగ టన్నుకు రూ. 500 చొప్పున రూ. 10 వేలు చెల్లిస్తున్నారు.ఇలా సేకరించిన కర్రను గుంటూరు జిల్లా పేరేచర్లకు తరలించి విక్రయించుకుంటున్నారు.

కూలీలకు ఆసరాగా..

వాగులు, వంకల్లోని చిల్ల కర్రను కొట్టుకొని తెచ్చుకున్నా అడవిలోని కర్ర తెస్తున్నారంటూ ఫారెస్టు సిబ్బంది ఇబ్బంది పెడుతున్నట్లు కూలీలు వాపోతున్నారు. ఫారెస్టు సిబ్బందికి రూ.50 వంతున వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కర్ర కొట్టి ముళ్ళు గుచ్చుకొని ఇబ్బంది పడి కర్రను విక్రయించేందుకు తీసుకువెళ్తుంటే దారిలో అడ్డగించి మామూళ్ళు వసూలు చేస్తున్నట్లు కూలీలు వాపోతున్నారు.

కూలీలకు ఉపాధి..

కరువు కాలంలో కట్టెలు సేకరిస్తూ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు పిచ్చికర్ర వ్యాపారి వెంకటేశ్వర్లు తెలిపారు. కూలీల నుంచి కట్టెలు సేకరించి గుంటూరు తరలించి విక్రయిస్తే డిమాండ్‌ను బట్టి లోడుకు రూ. 8 వేల నుంచి రూ. 15 వేల వరకూ మిగులుతుందన్నారు. కట్టెలు తరలించేటప్పుడు గ్రామ రెవెన్యూ అధికారి పర్మిషన్ ఉన్నా పల్నాడు జిల్లా సంతమాగులూరు అడ్డరోడ్డు దగ్గర ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు ఆయన వాపోయారు. లోడుకు రూ. 1000 నుంచి రూ. 3 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఒక్కోసారి లోడ కర్ర విక్రయించినా లాభం రాకపోగా నష్టం వస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనుల కంటే మేలు

గాయం నాగలక్ష్మి, కూలీ, నర్సాయిపాలెం

కుటుంబ పరిస్థితుల దృష్ట్యా వలస వెళ్ళలేక బతుకు దెరువు కోసం చిల్లకర్ర లోడింగ్‌కు వెళ్తున్నా. రోజుకు రూ. 500 వరకూ కూలీ పడుతోంది. ఉపాధి పనుల కంటే ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. ఎప్పటి డబ్బులు అప్పుడే వస్తున్నాయి. వాటితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

వలస పోకుండా బతుకుదెరువు

మల్లెల రవణ, కూలీ, నర్సాయిపాలెం

చిల్లకర్ర లోడింగ్ పనులు వలస పోకుండా బతుకు దెరువును చూపాయి. సకాలంలో వర్షాలు కురవక, వ్యవసాయ పనులు దొరకడం లేదు. ఉపాధి పనులు ఇంకా ప్రారంభించలేదు. ఈ తరుణంలో చిల్ల కర్ర లోడింగ్ పనులు దొరకడం కొంత ఊరటనిస్తోంది.

కూల్చివేత

కొందరివేనా..

ముహూర్తం త్వరలోనే..

కూల్చాలన్న భవనం ఇదే

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో అనుమతి ప్రకారం లేని అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించాల నుకున్నారు. అందులో ఓ వర్గానికి చెందిన కొన్ని భవనాలు మాత్రమే కూల్చివేయనున్నట్లు సమాచారం. అక్రమార్కులు ఎందరో ఉన్నా... కొందరి భవనాలే టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు త్వరలో మరోమారు ముహూర్తం ఖరారు కానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.! మార్కాపురం మున్సిపాలిటీలో ఇప్పటి వరకూ అనుమతికి మించిన కట్టడాలు ఎన్ని చేపట్టినా ఎలాంటి చర్యలు ఉండేవి కావు. తాజాగా అదే కుదరదని అధికారులు హెచ్చరిక చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఈ చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. అక్రమ కట్టడాలు వందల్లో ఉన్నా... ఏడింటికి మాత్రమే నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులు అందుకున్న వారంతా వైసిపికి చెందిన వారే. ఓ వర్గానికి చెందిన వారికే నోటీసులు ఇవ్వడం... వారి భవనాలను కూల్చివేస్తామనడంలో ఆంతర్యమేమిటని ప్రజల్లో చర్చకు తెరలేపింది. నిబంధనలు ఉల్లంఘించిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా... చర్యలు ఒకే రీతిన ఉండాలనేది ప్రజాభిప్రాయం. ఇక్కడ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని కాలేజీ రోడ్డులో తాటిపర్తి అశోక్‌రెడ్డికి చెందిన భవనం కూల్చివేతకు శుక్రవారం రంగం సిద్ధం చేశారు. దాన్ని వైసిపి శ్రేణులు తాత్కాలికంగా అడ్డుకోగలిగారు. దాంతో పాటు మిగిలిన ఆరు భవనాలు కూడా కూల్చివేతకు త్వరలో ముహూర్తం ఖరారు కానుందని తెలిసింది. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో తామేమీ చేయలేమనే ధోరణిలో అధికారులు ఉన్నట్లు తెలిసింది.

మున్సిపాలిటీలో వెయ్యికి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు తెలిసింది. మున్సిపల్ అధికారులు చెప్పడం కూడా వందల్లో ఉన్నాయంటున్నారు. భారీగా అక్రమ కట్టడాలు ఉండగా ఆ ఏడింటికే నోటీసులు ఎందుకిచ్చారు. ఆ ఏడు భవనాలే కూల్చాలనుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. కూల్చాలనుకుంటే అక్రమ కట్టడం దారులందరికీ నోటీసులు ఇవ్వండి... అందరి భవనాలు కూల్చివేయండి అనేది ప్రజల వాదన. అధికారులను మాత్రం ఇదేమి న్యాయమని ప్రశ్నిస్తే మౌనమే సమాధానంగా మిగిలింది. రాబోవు రోజుల్లో ఎవరి భవనాలు కూలిపోతాయో... ఎవరివి మిగిలిపోతాయే వేచి చూడాల్సిందే.

24,25 తేదీల్లో

ఐద్వా శిక్షణా తరగతులు

మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 24,25 తేదీల్లో ఒంగోలులోని ఎల్‌బిజి భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. ఐద్వా నగర కమిటీ సమావేశం మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రపంచీకరణ విధానాలు మహిళల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న విష సంస్కృతితో సమాజంలో మహిళలు, చిన్నారులపై అకృత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో కుటుంబ జీవనం చిన్నాభిన్నం అవుతోందని, ఈ ప్రభావం అంతా మహిళల మీద పడుతోందని చెప్పారు. మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాల పట్ల మహిళలకు అవగాహన కల్పించి, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు గాను ఐద్వా ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి శిక్షణా తరగతులు దోహదపడతాయని తెలిపారు.ఈ సమావేశంలో ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గోవిందమ్మ, గంగవరపు ఆదిలక్ష్మి, నగర నాయకులు కె రాజేశ్వరి, గంధవళ్ల కళ్యాణి పాల్గొన్నారు.

24న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్ : ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మేయర్ గంగాడ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 18న జరపాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల అప్పట్లో వాయిదా వేశామని, వాయిదా వేసిన సమావేశాన్ని తిరిగి ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు.



మంత్రి లోకేష్‌తో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

మంత్రి లోకేష్‌ను కలిసిన ఒంగోలు ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మంగళవారం కలిశారు. జిల్లా సమస్యలు, పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి పనులపై మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, 2018లో ఏర్పాటైందని, నిధుల లేమితో వివిధ విభాగాలు, కార్యాలయాలను నిర్వహించడం విశ్వవిద్యాలయానికి కష్టంగా మారిందన్నారు అందుకు సంబంధించిన ప్రతిపాదనలను యూనివర్సిటీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిందన్నారు. అడ్మినిస్ట్రేషన్, అకడమిక్ బ్లాక్‌లు, బాలురు, బాలికల వసతి గృహాలు, లైబ్రరీ, అంతర్గత రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం. వాహనాల కొనుగోలు. 130 టీచింగ్, 103 నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల దష్ట్యా విశ్వవిద్యాలయం సక్రమంగా నిర్వహించడానికి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి మొదటి దశలో రూ.84.75 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

22 నుంచి మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 22, 23, 24 తేదీల్లో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 22న ఉదయం 10 గంటలకు ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న రెడ్ క్రాస్ సొసైటీలో సినీ హీరో, చిరంజీవి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ప్రకాశం జిల్లా చిరంజీవి యువత నిర్వహించు ఉచిత రక్తదాన కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 గంటలకు ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 1 వద్ద నవోదయ స్కూలుకు వెళ్లే నీటి పైపు లైన్ శంకుస్థాపనలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుతో కలసి పాల్గొంటారు. 11.30 గంటలకు ప్రకాశం భవనంలో సంయుక్త కలెక్టర్ కార్యాలయంలో ఒంగోలు విమానాశ్రయం ఏర్పాటుపై నిర్వహిస్తున్న సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుతో కలిసి పాల్గొంగారు. మధ్యాహ్నం 1 గంటకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈనెల 23న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు గిద్దలూరు పట్టణంలో రాచర్ల గేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి రైల్వే గతి శక్తి, రెవెన్యూ, విద్యుత్, మునిసిపాలిటీ, రోడ్ల భవనాల శాఖల అధికారులతో నిర్వహిస్తున్న సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలసి పాల్గొనున్నారు. రాత్రి 8.30 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలకు హాజరవుతారు. ఈనెల 24న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలులో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు కార్పొరేషన్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రమాణం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎఒ రమేష్‌బాబు

ఎంఆర్‌పి ధరలకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి - నగరం

మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఎఒ వి రమేష్ బాబు మంగళవారం తనిఖీ చేశారు. తన కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు ఎంఆర్‌పి ధరకే అమ్మాలని సూచించారు. అధిక ధరలకు అమ్మితే నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఎరువుల దుకాణంలో ధరల పట్టిక స్టాక్ కనపడే విధంగా వుంచాలని ఆదేశించారు. రైతు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని చెప్పారు. అనుమతులు వున్న స్టాక్ మాత్రమే అమ్మకాలు చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న స్టాక్‌కు ఈ పాస్ మిషన్‌లో వున్న స్టాక్‌కు సరిపోయేలా వుండాలని చెప్పారు. తనిఖీల్లో ఎఈఒ కె నాగ శ్రీనివాస్, డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న ఎఒ విశ్వనాథం

మినుముకు బలం మందు పిచికారీ చేయాలి

ప్రజాశక్తి - వేటపాలెం

నెల రోజుల మినుము పంట పూతా, పిందే కొరకు బలం మందు 13-0-45 రకం ఎకరాకి కెజీ చొప్పున పిచికారి చేయాలని ఎఒ విశ్వనాథం తెలిపారు. కొత్తపేట రైతు సేవా కేంద్రం పరిధిలోని మినుము పంటను మంగళవారం పరిశీలించారు. మినుము 25నుంచి 35 రోజుల మధ్య కాల వ్యవధిలో పూత, పిందే కొరకు బలం మందు పిచికారి చేయాలని తెలిపారు. రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడా క్రోపిడ్ 2.5 ఎంఎల్, క్లోరో పైరీఫాస్ 2.5 ఎంఎల్ ఒక లీటర్ నీటి చొప్పున పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఎకరాకి 10 నుంచి 15 వరకు ఎల్లో స్టిక్ ప్యాడ్స్, ఫెర్మో ట్రాప్స్ పెట్టుకోవాలని తెలిపారు. రైతు పొలంలో వేసిన పంట వారం రోజుల లోపల రైతు సేవా కేంద్రంలోని విఎఎ, విహెచ్ఎ ద్వారా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఎఇఒ గోపి, విఎఎ శివ నాగబాబు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మృతిచెందిన తిరుపతమ్మ

పిడుగుపాటుకు వరి నాట్లు వేస్తున్న మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని పొన్నపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పొన్నపల్లి గ్రామానికి చెందిన వారే తిరుపతమ్మ (35) వరి నాట్లు వేయడానికి పొలానికి వెళ్లింది. ఆ సమయంలో అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో పాటు పిడుగులు పడడంతో మహిళ అక్కడికక్కడే కుప్పకూలింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను తోటి కూలీలు గుల్లపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. మృతురాలి భర్త గతంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించగా ఇరువురు పిల్లలను కూలి పనులు చేసుకుంటూ చూసుకుంటుండగా ఇప్పుడు ఆమె కూడా మరణించడంతో ఆమె ఇరువురు పిల్లలు అనాథలు అయ్యారు.

పంట నమోదు చేయించుకోవాలి

ఈ క్రాఫ్ నమోదును పరిశీలిస్తున్న ఎఒ సునీత

ప్రజాశక్తి - వేమూరు

మండలంలో రైతులు ఖరీఫ్ సీజన్‌కు పంట నమోదు చేసుకోవాలని ఎఒ సిహెచ్ సునీత కోరారు. గ్రామ్మాల్లో పంట నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు మీ గ్రామాల్లో రైతు సేవ కేంద్రంకు వెళ్లి గ్రామ వ్యవసాయా సహాయకులను కలిసి పొలం పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు రైతు కార్డు ఉన్నట్లయితే దానిని జెరాక్స్ ఇవ్వవలని కోరారు. ఈ పంట నమోదు చేపించు కోవటం వలన పంట నష్టపరిహారం, పంట కొనుగోలు పొందడానికి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

చెరుకుపల్లి : రైతులు అందరూ తప్పనిసరిగా తాము సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఎఒ సూచించారు. మండలంలోని కావూరు గ్రామ పరిధిలో ఈ పంట నమోదును ఆయన మంగళవారం పర్యవేక్షించారు. రైతులు సాగుచేసిన పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం వలన పంట నష్టపరిహారాలు, బీమా, మద్దతు ధరకు ధాన్యం అమ్ముటకు అనుమతులు పొందడం, తదితర ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. పొలం ఆన్లైన్‌లో లేకపోయినా పంట నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. కొంత మంది రైతుల పొలాలు ఆన్లైన్లో నమోదు కానప్పటికీ వారందరూ సంబంధిత పత్రాల ద్వారా ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు తమ కౌలు గుర్తింపు కార్డుల ద్వారా ఈ పంట నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు పొలం పాస్ బక్ జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్సులతో తమ గ్రామ పంచాయతీలోని వ్యవసాయ సహాయకులను కలవాలని కోరారు.

ఈ పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ

ఎన్‌సిపిఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం, చీరాల

విద్యార్థులు నేషనల్ కెరీర్ సర్వీసెస్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ ప్రాంతీయ సంచాల కులు ఆర్‌పి రవిశంకర్ తెలిపారు. మండలంలోని అక్కయ్యపాలెం పంచాయతీ రామాపురం ఇంజనీరింగ్ కళాశాల నందు భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విభాగమైన దత్తోపత్ ఠేంగడి జాతీయ కార్మిక విద్యా అభివృద్ధి సంస్థ విజయవాడ ప్రాంతీయ కార్యాలయ సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్మెంట్ సొసైటీ ప్రభుత్వ పథకాల అవగాహన నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తోపంత్ ఠేంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ విజయవాడ ప్రాంతీయ సంచాలకులు ఆర్‌పి రవిశంకర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కెరీర్ సర్వీసెస్ పోర్టల్ నందు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొనుట ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. నేషనల్ కెరీర్ సర్వీసెస్ అనేది భారత ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి అని విద్యార్థులు తమ పేర్లను ఈ పోర్టల్ నందు నమోదు చేసుకోవడం ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశానికి ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డి మతీన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవిశంకర్

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - రేపల్లె

ప్రధాని నరేంద్రమోడీచే ప్రతిష్టాత్మకంగా జారీ చేయబడిన పిఎంకెవివై (ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం) పట్టణంలోని శారద ఐటిఐ కళాశాల ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నామని ప్రిన్సిపాల్ బడికి వెంకటనారాయణ అన్నారు. స్థానిక తెలుగుదేశం సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. కళాశాల నందు 3 కోర్సుల్లో 105 మంది విద్యార్థులకు ఉచితంగా 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. 105 మంది విద్యార్థుల్లో 102 మంది అభ్యర్థులు 98శాతం ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు. విద్యార్థులకు అనగాని శివప్రసాద్ సర్టిఫికెట్లు అందించారు. కార్య్రమంలో జిల్లా కన్వీనర్ సుధాకర్ బాబు, బిసి విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పరిశా వెంకటేశ్వరావు, రిటైర్డ్ ఎస్ఐ చెన్ను నాగమల్లే శ్వరరావు, ప్రిన్సిపల్ బడుగు జోష్ణ, అధ్యాపకులు మేరుగ నాగేశ్వరావు, మండే ప్రసాద్, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నారాయణ

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - వేటపాలెం

చల్లారెడ్డిపాలెం పంచాయితీ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు ఎస్ఐ మీసాల వెంక టేశ్వర్లు మంగళవారం స్వాదీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతు లు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలిం చారు. అక్రమంగా ఇసుక రవాణా చేసేవారిపై నిరంతర నిఘ ఉంటుం దని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాదీనం చేసుకున్న ఎస్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు నిరసనగా నేడు బంద్

ప్రజాశక్తి - అద్దంకి

భారత్ బందుకు సహకరించాలని ప్రజా సంఘాలు, మాల మహాసభ, మాల యువసేన, దళిత సంఘాలు, మాల మహానాడు, మాల సంఘాల జెఎసి నాయకులు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం, విద్యా సంస్థలు, హొటల్స్, వివిధ వ్యాపార సంస్థలు, టీ స్టాల్స్, ప్రభుత్వ సంస్థలు, ఆర్టీసీ, ఆటో, కార్ ట్రావెల్స్, లారీ అసోసియేషన్ భారత్ బందుకు సహకరించాలని కోరారు.

చెరుకుపల్లి : ఎస్సీ వర్గీకరణకు నిరసనగా నేడు భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు మాల సంఘం నాయకులు తెలిపారు. మాల సంఘం ఆధ్వర్యంలో భారత్ బంద్ విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ మాల సంఘ నాయకులు అందరూ బందులో పాల్గొనాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు.

కోవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - చీరాల

కోల్‌కత్తాలో వైద్యురాలపై అత్యాచార, హత్య కేసులో దొషులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ స్థానిక గడియార స్తంభం సెంటర్లో జనసేన, టిడిపి, బిజేపి ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం వద్ద మానవ హారం చేశారు. జనసేన నాయకులు ఆలా అనిల్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నప్పటికి సరైన పద్దతిలో అమలు కాలేక పోవడంతో స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేవుళ్ళతో సమానంగా కొలిచే డాక్టర్లకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు ఏ విధంగా రక్షణ ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. డాక్టర్ హత్యకు అక్కడి సీఎం పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సజ్జా హేమలత, కారంపూడి పద్మిని, గజవల్లి శ్రీను, కాళికా, లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వేటపాలెం

చీకట్లో దున్నపోతును ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో దున్నపోతు అక్కడక్కడే మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని 216 జాతీయ రహదారి నుండి వేటపాలెంకు వచ్చే వై జంక్షన్‌కి కొద్దిదూరంలో మంగళవారం రాత్రి జరిగింది. రామన్నపేట పంచాయితీ కొత్త కాలువకు సమీపంలో నివసించే పొగడదండ వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడు మస్తాన్‌రెడ్డితో కలిసి వేగంగా ఇంటికి వెళ్తున్నాడు. వై జంక్షన్ సమీపంలో లైట్లు లేకపోవడంతో దున్నపోతు కనిపించక అదే వేగంతో వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో దున్నపోతు ఒక్కసారిగా కింద పడిపోయి ప్రాణాలు విడిచిపోయింది. పొగడ దండ వెంకటేశ్వర్లు అతని స్నేహితుడు మస్తాన్‌రెడ్డికి ముఖంపై తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.

పరారీలో ఉన్న నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఆదినారాయణపురంలో ఈ నెల 6న జరిగిన విద్యార్థి హత్య కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి జగదీష్ నాయక్ తెలిపారు. స్థానిక 2వ పట్టణ పోలీసు స్టేషన్లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపురిపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ అమీన్ ఆరిఫ్ (18) హత్యకేసులో 8మంది నిందితులుగా గుర్తించారు. బాపట్ల మండలం వెదులపల్లికి చెందిన మల్లె సందీప్ ప్రసన్న కుమార్ అలియాస్ సందీప్, చీరాల మండలం పాపరాజు తోటకు చెందిన గరిక మహేంద్ర, కొత్తపేటకు చెందిన షేక్ జిలాని అలియాజ్ జిల్లు భాయ్, బాపట్లకు చెందిన షేక్ మహమ్మద్ రియాజ్, కావలి ప్రాంతంకు చెందిన పాశం లక్ష్మీనారాయణ అలియాస్ లక్ష్మణ్, స్టువర్టుపురంకు చెందిన దేవరకొండ శ్రీనివాసరావు అలియాస్ శ్రీను, చీరాల మండలం రామ్ నగర్ న్యూ కాలనీకి చెందిన అంగడి సుకుమార్, చీరాల మండలం రామకృష్ణాపురంకు చెందన కర్రెద్దుల వంశీల్లో 6 గురిని అరెస్టు చేసి రిమాండ్ పంపించారు. అయితే వీరిలో గరిక మహేంద్ర, కర్రెద్దుల వంశి ఆ సమయంలో పరారు కాగా ప్రత్యేక పోలీసు బలగాలతో కేసు ధర్యాప్తు చేసి నిందితులు ఇద్దరని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి జగదీష్ నాయక్

ప్రత్యేక పోలీసు బలగాలతో దర్యాప్తు

ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు డీఎస్పీ జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో రూరల్ సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ముగ్గురు ఎస్‌ఐలు, 20 మంది పోలీస్ సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి భౌతిక, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సేకరించిన ఆధారాలు ఒకదానికొకటి క్రోడీకరించుకొని సంబందిత న్యాయస్థానంలో ముద్దాయిపై చార్జి షీట్ దాఖలా చేసినట్లు తెలిపారు. న్యాయస్థానంలో ముద్దాయికి కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా కేసు ఛేదనలో విశిష్ట కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

యానిమేటర్లను తొలగించడంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా డ్వాక్రా గ్రూపులకు యానిమేటర్లుగా పనిచేస్తున్న దళిత మహిళా యానిమేటర్లను నిర్ధాక్షణంగా తొలగించడం పట్ల ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుపూడి విక్టర్ ప్రసాదును కలిసి వినతి పత్రం మంగళవారం అందజేశారు. ఆరుగురు దళిత మహిళ యానిమేటర్లను, మండల సమైక్యలో పనిచేస్తున్న ఎపిఎం, సీసీలైన తమను తొలగిస్తున్నట్లుగా చెప్పారని తెలిపారు. అంతే కాకుండా ఎలాంటి కారణం లేకుండానే రేపటి నుండి విధులకు రావద్దు అంటూ ఇటీవల తమను బెదిరించినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. 2003 నుండి ఇప్పటి వరకు యానిమేటర్లుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. తమకు అప్పగించే పనిని క్రమశిక్షణతో నెరవేర్చే వారమని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా పనిచేసిన తమను అర్ధాంతరంగా తొలగిస్తే తాము ఏ పని చేసుకుని బతకాలంటూ వాపోయారు. ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం లేకుండా తమను

విక్టర్ ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న యానిమేటర్లు

తొలగిస్తున్నట్లు చెప్పటం దారుణమని అన్నారు. తమకు న్యాయం జరిపించాలంటూ ఎస్‌సి కమిషనర్‌కు విన్నవించారు. ఐలవరం యానిమేటర్ ధోని భాగ్యలక్ష్మి, పల్లెకోన యనిమేటర్ యన్నం రాణి, కోళ్లపాలెం యానిమేటర్ కంచర్ల సీత, పల్లికొనే యామేటర్ కొమ్ము రత్తమ్మ, జిలుగువారిపాలెం యానిమేటర్ పులివర్తి మంజుష, రాచూరు యానిమేటర్ చిలకా సుధారాణి ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

టీకాలు వేయిస్తున్న జెడిఎ డాక్టర్ ఎం హనుమంతరావు

ప్రజాశక్తి - కర్లపాలెం

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు సూచించారు. మండలంలోని యేట్రవారిపాలెం, కొత్త నందాయపాలెం గ్రామాల్లో పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4నుండి 8 నెలల్లోపు వయస్సు గల ఆడ దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు, 4 నెలలు పైబడిన ఆవులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని రైతులకు సూచించారు. ఈ నెల 20నుంచి సెప్టెంబర్ 18వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కావున అన్ని గ్రామాల్లో పర్యటించే పశు వైద్య సిబ్బందికి పూర్తిగా సహాయ సహకారాలు అందించి అన్ని పశువులకు సామూహికంగా టీకాలు వేసేందుకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ టి శంకరరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం రేచల్ దివ్య పాల్గొన్నారు.

నిజాంపట్నం : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని కూచినపూడి పశు వైద్యాధికారి డాక్టర్ హేమ ప్రియ తెలిపారు. మండలంలోని కూచినపూడి పశువైద్యశాల్లో 4 నుంచి 8 నెలల వయసు ఉన్న పెయ్య దూడలకు బ్రూసిల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందుగా ఈ టీకాను వేయించి జాగ్రత్త వహించాలని చెప్పారు. వ్యాధి సోకిన పాడి గేదెల్లో పాలు గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి గేదెలు, ఆవులకు సోకితే ఈసుకుపోతాయని అన్నారు. వ్యాధి సోకిన పశువు పాలను దూడలు తాగితే చనిపోతాయన్నారు. టీకాను ఒక్కసారి ఆడదూడలకు వేస్తే తన జీవిత కాలం వరకు ఈసుకుని పోకుండా ఉంటాయన్నారు. టీకా వేసే కార్యక్రమం ఈ నెల 20 నుండి సెప్టెంబరు 20వరకు జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూచినపూడి ఎంపీటీసీ జి రత్నకుమారి, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ హేమప్రియ

కుర్చీలు బహూకరిస్తున్న దాతలు

పాఠశాలకు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

కురిచేడు మండలంలోని బోధనపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సౌజన్యంతో అష్టావధానం నిర్వహించారు. అష్టావధాని ఇలపావులూరి శేష శ్రీధరశర్మ, పృచ్ఛకులుగా బంధా వెంకట కృష్ణశాస్త్రి, డి పావని, ప్రసాదరావు, శివకుమారి, ప్రసన్నాంజనేయులు, శరత్ బాబు, శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కడియం పాపారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, పాల్గొన్నారు. అష్టావధానం విద్యార్థులను బాగా ఆకట్టుకున్నది. అవధానిని రోటరీ అధ్యక్షులు వీరయ్య, పుట్టం రాజు శ్రీరామ చంద్రమూర్తి, పాఠశాల సిబ్బంది సత్కరించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఆయన తనయుడు తాండవ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా 20కుర్చీలు బోధనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు బహుకరించారు.

అనారోగ్యంతో మహిళ మృతి

ప్రజాశక్తి - అద్దంకి, మేదరమెట్ల

చప్పిడి లలితమ్మ

కొరిసపాడు మండలం రావినూతలలో చప్పిడి కోల్డ్ స్టోరేజ్ యజమానిగా అందరికీ సుపరిచితులైన చప్పడి లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామంలో తెలుగుదేశం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఆవిడ ఉత్సాహంగా పాల్గొనేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించారని గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. వివిధ సినిమాలు నిర్మించిన రావినూతల గ్రామ వాసి దివంగత చప్పిడి హనుమంతరావు సతీమణి చప్పిడి లలితమ్మ మృతి గ్రామంలో విషాదం నింపింది. ఆమెకు సినీ రంగంలో పలువురితో పరిచయాలు ఉన్నాయి. ఆమె మృతి పట్ల గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన దృశ్యం

వైద్యురాలిపై అఘాయిత్యానికి నిరసన

ప్రజాశక్తి - ముండ్లమూరు

కలకత్తా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను అరెస్టు చేయాలని, మహిళా డాక్టర్లకు భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని శంకరాపురంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కలకత్తాలో డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను తక్షణం విచారణ జరిపి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో మీన వేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. తక్షణ చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలకు పాల్పడేందుకు ఆలోచిస్తారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గాలి వెంకటేశ్వర్లు, జాల రామాంజనేయులు, మదన్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ర్యాంగిగ్‌పై చిత్రలేఖన పోటీల్లో గెలిచిన విజేతలు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ కట్ట రామకోటేశ్వరరావు డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అధ్యక్షత వహించిన విద్యార్థినీ, విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ సెల్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, అనూష మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే శిక్షల గురించి తెలిపారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ ద్వితీయ స్థానంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సంబంధించిన భాగ్యంతో పాటుగా యాంటీ ర్యాగింగ్ సెల్ సభ్యులు వి ప్రసాద్, సిహెచ్ అనిత, బి అశోక్ కుమార్, ఎస్ దాసు, జి శివకోటి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న వెంకటేష్

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక భవిత కేంద్రంలో సాధు వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వెంకటేష్, ఆలేఖ్య దంపతులు ఇద్దరూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి ఆనందంగా జరుపుకున్నారు. వెంకటేష్ మాట్లాడుతూ ఇటువంటి పిల్లల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు, నోటు పుస్తకాలు పంచి పెట్టారు. వెంకటేష్‌కు ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇట్టా రామారావు, సాయిసునీల్, ఆయా లక్ష్మీ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - నిజాంపట్నం

అంగన్‌వాడి కేంద్రాలకు బాలామృతం సరఫరా చేసేందుకు ఆసక్తిగల సొంత వాహనదారుల నుండి కొటేషన్స్ కోరుతున్నట్లు పల్లపట్ల ఐసీడీఎస్ సీడీపీఓ అనసూయ మంగళవారం కోరారు. పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు గోడౌన్ నుండి నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న 141 అంగన్‌వాడి కేంద్రాలకు బాలామృతం బస్తాకు (08 ప్యాకెట్స్) చొప్పున 2024-25 ఒక ఆర్థిక సంవత్సరం కాలనికి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వాహనదారులు ఈ నెల 21 నుండి 26వరకు పల్లపట్ల ఐసీడీఎస్ కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

బొడ్డువానిపాలెం వద్ద ప్లాస్టిక్ బార్కేట్లను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన షేక్ నాగూర్ భాష (26) ఒంగోలు వెళ్తూ బొడ్డువానిపాలెం ఆర్చి వద్ద దారి మళ్లింపుకు పెట్టిన ప్లాస్టిక్ బార్కేట్లను ఢీ కొని క్రిందపడి అక్కడే మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల కోసం ప్రతిపాదనలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 18న 'సంక్షేమమా అదేక్కడ' అనే శీర్షికతో ఒకథనం ప్రచురితమైంది. ఆ కథనానికి జిల్లా షెల్యూల్డ్ కులాల సంక్షేమం మరియు సాధికారత, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎన్ లక్ష్మా నాయక్ స్పందించారు. వసతి గృహంలో సరిపడ వసతులు లేనందున విద్యార్థులు వసతి గృహ ప్రవేశం కోసం సముఖత చూపించడం లేదన్నారు. నూతన భవనం నిర్మాణం కొరకు పిఎంఎజెేఎవో పథకం కింద నిధులు మంజూరు కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఎఫ్ఎసి లేనందున ఇబ్బందులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 18న 'ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థుల ఇక్కట్లు..పెండింగ్‌లో భారీగా దరఖాస్తులు..రెగ్యులర్ తహశీల్దారు లేక అవస్థలు' అనే శీర్షికతో ఓ కథంన ప్రచురితమైంది. ఆ కథనానికి పెద్దదోర్నాల ఇన్‌ఛార్జి తహశీల్దారు పి. శైలైంద్ర కుమార్ స్పందించారు. తనకు ఎఫ్ఎసి బాధ్యతలు లేకపోవడం వల్ల డిజిటల్ సంతకం లేక అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఫలితంగా విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

'వెలిగొండ'పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



ప్రజాశక్తి - అద్దంకి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం గురించి మాట్లాడే కనీసం అర్హత కూడా వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి లేదని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును అనాధరైజ్డ్ ప్రాజెక్టుగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు, టిడిపి నేతలు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఆథరైజ్డ్ ప్రాజెక్టుగా గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించారని గుర్తు చేశారు. అధికారంలో ఉండి జగన్‌రెడ్డి చేయాల్సిన పనిని తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండి చేసిందన్నారు. దీనికి జగన్ మోహన్‌రెడ్డి నిజంగా సిగ్గుపడాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి స్వప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు అవసరం లేదని ఆరోపించారు. అప్పటి తెలంగాణ సిఎం కేసీఆర్‌తో కలిసి కుమ్మక్కై ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు జగన్ మోహన్‌రెడ్డి తాకట్టుపెట్టారని విమర్శించారు. ఇసుక దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టుల నిర్వహణ పై జగన్మోహన్‌రెడ్డికి లేదని ఆరోపించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే అమర్చలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. అ లాంటి వ్యక్తి చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతారా?అని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలోని ప్రతీ సాగు నీటి ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని, అలాంటి వాటని జగన్ రెడ్డి తన హయాంలో గాలికి వదిలేశాడని చెప్పారు. ఈ కారణం గానే ఏకంగా అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందన్నారు. రాష్ట్రాభివద్ధికి పాటుపడాలని, రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనలు జగన్ మోహన్ రెడ్డికి ఎలాగూ రావని అన్నారు. ఇలాంటి సమయంలో కనీసం కొద్ది రోజుల పాటు ఏం మాట్లాడ కుండా ఉంటే జగన్ రెడ్డికి చాలా మంచిదని హితవు పలికారు.

'జార్జి' విద్యార్థుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం

కోలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశంలో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే నిందితులను బహిరంగ ప్రదేశంలో ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మహిళల

నిరసన ప్రదర్శనలో విద్యార్థులు

ఈ కార్యక్రమంలో జార్జి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ విద్యుత్ మీటర్ల రీడర్లు మార్కాపురం సబ్ డివిజన్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. చాలీ చాలనీ జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నట్లు తెలిపారు. ఇచ్చే అరకొర జీతం కూడా నెలనెలా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతున్నట్లు తెలిపారు. జీతాలతో పాటు ఇపిఎఫ్ డబ్బులు కూడా సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. తమ నుంచి అధికంగా కటింగ్ చేసినా తక్కువ మొత్తంలో చెల్లిస్తున్నారన్నారు. అరియర్స్ అమౌంట్ కూడా రావాల్సి ఉందన్నారు. తక్కువ వేతనాలతో పనిచేసే తమను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం భావ్యం కాదని మార్కాపురం డివిజన్ మీటర్ రీడర్ల అసోసియేషన్ నాయకులు షేక్ అన్వర్, పి.సతీష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీటర్ల రీడర్లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ఎస్‌పి ఎఆర్. దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎస్‌పి ఎఆర్. దామోదర్ తెలిపారు. ఎఆర్ పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ఎస్‌పి మెడల్స్, క్రికెట్ ట్రోఫీలు అందజేసి మంగళవారం అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది టీమ్స్ రెండు గ్రూపులుగా తలడ్డారు. ఏ గ్రూప్‌లో స్వాట్ టీమ్ జూనియర్, డిపిఒ, ఐటీ కోర్, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్, బి గ్రూప్ లో స్పెషల్ పార్టీ జూనియర్, స్పెషల్ పార్టీ సీనియర్, స్వాట్ టీమ్ సీనియర్, ఆఫీసర్స్ టీమ్ జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్, పోలీస్ ఆఫీసర్స్

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్‌పి దామోదర్

జట్ల మధ్య రసవత్తరంగా సాగింది. ఈ మ్యాచ్‌లో పోలీస్ ఆఫీసర్స్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఆర్ఎస్ఐ కె.మాలాద్రి అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ, వివిధ రకాల కేసులు దర్యాప్తు, బందోబస్తు లాంటి విధులతో సతమతమవుతున్న సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. క్రికెట్ మ్యాచ్ ల్లో పోలీస్ సిబ్బంది చూపిన ఉత్సాహం, పోరాట స్ఫూర్తిని అభినందించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక్క క్రీడను ఎంచుకొని ఆడటంతో మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సిబ్బంది క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి యోగ, మెడిటేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, ఎఆర్ ఏఎస్‌పి అశోక్ బాబు, ఐటి కోర్ సిఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమేష్ కష్ణన్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమ తెరలను వినియోగించాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దోమల నుంచి రక్షణ పొందటానికి ప్రజలు దోమ తెరలను వినియోగించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మాధవీలత తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఒంగోలు విఎన్‌జి హైస్కూలులో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిగి వ్యాధి నియంత్రణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈ ఏడాది దోమ రహిత సమాజం ఆరోగ్యానికి సోపానం నినాదంతో కార్యక్రమం నిర్వసు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు కార్యక్రములో ఉప మాస్ మీడియా అధికారి సరోజిని, సబ్ యూనిట్ అధికారులు సాగర్, శ్రీనివాసులు ,వెంకారెడ్డి విఎన్‌జి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.మాధవరావు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

భూ సమస్యలను పరిష్కరించాలి : జేసీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూములు, ఎస్టేట్ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈనాం భూముల సమస్యల పై ఆర్‌డిఒ, తహశీల్దార్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో నాలుగు ఈనాం ఎస్టేట్ గ్రామాలు, మూడు ఈనాం గ్రామాలు అపరిష్కృతంగా వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నాలుగు ఈనాం ఎస్టేట్ గ్రామాలను రైతు వారీ గ్రామాలుగా మార్చడానికి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి మార్టూరు మండలంలో లక్కవరం, జంగ మహేశ్వరపురం, పర్చూరు మండలంలో ఎడుబాడు, సంతమాగులూరు మండలంలో గోపాపురం గ్రామాలు అని తెలిపారు.మూడు ఈనాం గ్రామాలు రైతు వారీ గ్రామాలుగా మార్చడానికి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి పర్చూరు మండలం చెన్నుబోట్ల అగ్రహారం, సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామాలని తెలిపారు. రైతులు ఈనాం భూ సమస్యల వల్ల ఇబ్బంది పడకుండా చూసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఆ భూముల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఈనాం భూములకు సంబంధించిన దస్త్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ రవీంద్రర్, పలు తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు